క్లుప్తంగా

మిద్దెతోట, పెరటితోటలపై అవగాహన సదస్సు

గుంటూరు రూరల్: రైతు నేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 22వ తేదీ మిద్దెతోట, పెరటి తోటల పెంపకంపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ వై.వెంకటేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు నగరంలోని బృందావన్‌గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం కల్యాణ మండపంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు సదస్సు ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు 9705383666 సంప్రదించాలని కోరారు.

రీసెర్చ్ సెల్ ఆధ్వర్యంలో సదస్సు

ఏఎన్‌యూ: నాగార్జున విశ్వవిద్యాలయ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో మంగళవారం బయో ఈ -3 అంశంపై సదస్సు నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన వికసిత్ భారత్ 2047లో భాగంగా బయో ఈ -3 (బయోటెక్నాలజీ ఫర్ ఎకానమీ, ఎన్విరాన్మెంట్, ఎంప్లాయిమెంట్) పాలసీలు, జీవ ఉత్పత్తి పెంపొందించుట, అమృత కాలం నెరవేర్చే లక్ష్యంతో ఈ సదస్సు నిర్వహించామని సదస్సు డైరెక్టర్, రీసెర్చ్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.సుధాకర్ తెలిపారు. సదస్సుకు ముఖ్య అతిథులుగా సీడీఎఫ్‌డీ శాస్త్రవేత్తలు ఎం.సుబ్బారెడ్డి, డాక్టర్ యతీస్ ఆచార్, డాక్టర్ మధుసూదన్ రెడ్డి హాజరయ్యారన్నారు. బయో ఈ - 3 పాలసీలను విద్యార్థులకు పరిశోధకులకు అతిథులు వివరించారు. భవిష్యత్తులో బయో ఈ - 3 వల్ల ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని వాటి ద్వారా ఆర్థిక అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ చేసేందుకు యువత భాగస్వాములుగా నిలవాలని సూచించారు. సదస్సులో ఏఎన్‌యూ వీసీ ఆచార్య కె.గంగాధరరావు, రెక్టార్ ఆచార్య కె.రత్న షీలా మణి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు మంత్రి ఆనంకు ఆహ్వానం



నగరంపాలెం: గుంటూరు ఆర్.అగ్రహారం శ్రీకన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో నిర్వహించనున్న దసరా ఉత్సవాలకు దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి ఆహ్వాన పత్రికను మంగళవారం అందజేశారు. విజయవాడలో మంత్రిని కలసి దేవస్థానం ఉత్సవ కమిటీ సభ్యులు అందజేశారు. మంత్రిని కలిసిన వారిలో ఉత్సవ కమిటీ చైర్మన్ ఇరంటి వరప్రసాద్, బీజేపీ జిల్లా అధ్యక్షులు వనమా నరేంద్ర, టీడీపీ నాయకులు కొనకళ్ల సత్యం, కోటా శేషగిరిరావు, నేరెళ్ల హరిప్రసాద్, సభ్యులు వి.రఘు ఉన్నారు.

విశాఖ స్టీల్ ప్రైవేటీకరణ విధానాలు మానుకోవాలి

లక్ష్మీపురం: విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ విధానాలు మానుకోవాలని అఖిల భారత కార్మిక, రైతు సంఘాల సమన్వయ కమిటీ పిలుపు మేరకు గుంటూరు శంకర్ విలాస్ సెంటర్‌లో మంగళవారం నిరసన చేపట్టారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అకిటి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ ను కేంద్ర ప్రభుత్వం సెయిల్ లో విలీనం చేయాలని, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ విధానాలు మానుకోవాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ గుంటూరు తూర్పు కమిటీ ప్రధాన కార్యదర్శి కే శ్రీనివాసరావు అధ్యక్షత నిర్వహించిన కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వెలుగురి రాధాకష్ణమూర్తి, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి దయా రమాదేవి, ఏఐకేఎస్ జిల్లా కార్యదర్శి కె.అజయ్ కుమార్, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కొల్లి రంగారెడ్డి, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి, బి.శ్రీనివాసరావు, ఏపీ ఎఫ్‌టీయూ, జిల్లా నాయకులు కూరపాటి కోటయ్య నిరసనలో పాల్గొన్నారు.

జీవితంలో ఆటుపోట్లను ధైర్యంగా ఎదుర్కోవాలి

గుంటూరు ఎడ్యుకేషన్: జీవితంలో ఎదురయ్యే ఆటుపోట్లను ధైర్యంగా ఎదుర్కోవాలని ఆక్స్‌ఫర్డ్ హైస్కూల్ డైరెక్టర్ డి.శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నెహ్రూనగర్‌లోని పాఠశాలలో సూసైడ్ ప్రివెన్షన్ డే సందర్భంగా స్పందన ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు శారీరకంగా ఆరోగ్యంగా ఉండటంతో పాటు మానసికంగాను ధృడంగా ఉండాలని స్పందన ఈదా ఫౌండేషన్ ప్రతినిధి మాదా చిరంజీవి మాట్లాడుతూ జీవితం ఎంతో విలువైనదని, ఏదైనా అనుకుంటే సాధించగలిగే శక్తి, సామర్థ్యాలు మనలో ఉన్నాయని తెలిపారు. సదస్సులో ఉపాధ్యాయులతో పాటు 8,9,10 తరగతుల విద్యార్థులు పాల్గొన్నారు.

ఆత్మహత్యల నివారణ దినోత్సవం

లక్ష్మీపురం: క్షణికావేశంలో ఎంతో మంది తమ జీవితాలకు ఆత్మహత్యల రూపంలో ముగింపు పలకడం బాధాకరమని డాక్టర్ కె.సురేష్‌కుమార్ అన్నారు. అరండల్‌పేటలోని అవగాన సంస్థ కార్యాలయంలో మంగళవారం నిరాశను జయిద్దాం ! బతికి సాధిద్దాం నినాదంతో సభ నిర్వహించారు. సభలో మానసిక వైద్యులు డాక్టర్ కె.సురేష్‌కుమార్ పాల్గొన్నారు. . విద్యావేత్త, విశ్లేషకులు ఇ.చంద్రయ్య మాట్లాడారు. కార్యక్రమంలో విశ్రాంత ప్రధానోపాధ్యాయులు నారపరెడ్డి, యోగాచార్యులు అచ్యుత ఇందు శేఖర్ పాల్గొన్నారు.

వెన్నుముకకు దన్ను అవసరం

- గాయాలపై అప్రమత్తంగా ఉండాలి
- వెన్నుముక గాయాలపై అవగాహన కార్యక్రమాలు



గుంటూరు మెడికల్: మానవ శరీరంలో వెన్నుముక కీలకమైనది. మనిషి రోజు కార్యక్రమాలకు స్ప్రింగ్‌లా పనిచేస్తుంది. వెన్నుముకకు ఏదైనా దెబ్బతగిలితే కూర్చోలేక, నిలబడలేక మంచానికే పరిమితమై పోతాడు. మనిషిని నిటారుగా నిలబెట్టే వెన్నుముకకు గాయాలైనప్పుడు సరైన జాగ్రత్తలు తీసుకోని పక్షంలో జీవితాంతం మనిషి మంచానికే పరిమితమై అవస్థలు పడుతుంటాడు. వెన్నుముక గాయాలపై ప్రజలకు అవగాహన లేకపోవడం, అపోహలు ఉండటం ద్వారా అనేక మంది చికిత్సకు దూరంగా ఉంటున్నారు. ప్రజలకు అవగాహన కలిగించేందుకు సెప్టెంబరు 5 నుంచి 11 వరకు నిర్వహిస్తున్న అవగాహన వారోత్సవాలు బుధవారం ముగియనున్నాయి.

కారణాలు ఇలా..

సాధారణంగా రోడ్డు ప్రమాదాల వలన వెన్నుముక గాయం ఏర్పడుతోంది. వాహనాలపై ప్రయాణిస్తున్న సమయంలో అదుపు తప్పి పడిపోవడం, మరో వాహనం ఢీకొనడం వలన కింద పడిన వ్యక్తి వెన్నుముక విరిగిపోతోంది. చెట్లు ఎక్కి నరికే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోకపోతే, ఎత్తైన భవనాలపై పనిచేస్తున్న సమయంలో అప్రమత్తంగా లేకపోతే కిందపడిపోయి వెన్నుముక విరుగుతోంది. ఇలాంటి వారికి అత్యాధునిక శస్త్రచికిత్సలు అందుబాటులో ఉన్నాయి. అయితే వెన్నుముక శస్త్రచికిత్స చేసినప్పటికీ గాయమైన సమయంలో వెన్నుముక చుట్టుపక్కల ఉండే నరాలు పటుత్వం కోల్పోయి సదరు వ్యక్తి నడక ఇబ్బందిగా మారుతోంది. ఇలాంటి వారికి రీహాబిలిటేషన్ చికిత్స ద్వారా నరాల్లో ఉన్నపటుత్వం తీసుకొచ్చి నడకను సరిచేయవచ్చు.

లక్షణాలు

- వెన్నుముక గాయమైన వారికి స్పర్శ, చలనం ఉండదు. వెన్నుముక భాగమంతా కదలిక లేక నడవలేకపోవడం, మలమూత్రాలను అదుపులో పెట్టుకోలేక మంచంలోనే విసర్జించడం జరుగుతోంది.
- వెన్నుముక ఆపరేషన్ చేసిన నరాలు చచ్చుబడిపోవడం వలన నడక ఇబ్బందిగా మారుతోంది
- ఇలాంటి వారికి రీహాబిలిటేషన్ ద్వారా ఉన్న నరాల పటుత్వం ద్వారా నడక నేరిపించవచ్చు
- ఏపీలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో విశాఖపట్నంలో రీహాబిలిటేషన్ సెంటర్ పనిచేస్తుంది

బాధితులు అధికమే

భారతదేశంలో 1.5 మిలియన్ల మంది వెన్నుముక గాయాలతో బాధపడుతున్నారు. ప్రతి ఏడాది 20 వేల మంది కొత్తగా రోడ్ల ప్రమాదాల వల్ల, ఎత్తైన భవనాలు, చెట్లపై నుంచి పడి వెన్నుముక సమస్యలతో బాధపడుతున్నారు. కొంత మంది ఇన్‌ఫెక్షన్‌ల ద్వారా, వెన్నుముక టీబీ ద్వారా వెన్నుముక సమస్యల బారిన పడుతున్నారు. బాధితుల్లో 80 శాతం పురుషులు, 20 శాతం మహిళలు ఉన్నారు. వీరిలో సగం మంది 15 నుంచి 30 సంవత్సరాల వయస్సు వారే.

అవగాహన కల్పిస్తున్నాం



స్పైనల్ కార్డ్ గాయాలపై ప్రజలకు అవగాహన లేకపోవడం వలన జీవితాంతం మంచానికే పరిమితమై అవస్థలు పడుతున్నారు. వెన్నుముక గాయాలపై గుంటూరులోని మల్లికా స్పైన్ రీహాబ్ సెంటర్‌లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. వెన్నుముక గాయాలను అశ్రద్ధ చేయకుండా ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స చేయడం ద్వారా త్వరితగతిన కోలుకోవచ్చు. ప్రాథమిక దశలో చికిత్స చేయించడం ద్వారా సర్జరీలతో పనిలేకుండా ఫిజియోథెరపి, ఇతర చికిత్స విధానాల ద్వారా వెన్నుముక గాయాలను నయం చేయవచ్చు.

– డాక్టర్ జి.నరేష్‌బాబు, సీనియర్ స్పైన్ సర్జన్

అనిల్‌కుమార్ ప్రాణత్యాగం దళిత పల్లెవీరులకు స్ఫూర్తి



అనిల్‌కుమార్ చిత్రపటం వద్ద నివాళి

నెహ్రూనగర్: చుండూరు దళిత పల్లెవీరుడు కొమ్మెర్ల అనిల్‌కుమార ప్రాణత్యాగం, దళిత పల్లె వీరులకు స్ఫూర్తిదాయకమని మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ పేర్కొన్నారు. దళిత బహుజన ఫ్రంట్ ఆధ్వర్యంలో అరండల్‌పేటలో అనిల్‌కుమార్ వర్ధంతి సభ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితులు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భావజాలంతో తమ జాతిని పునఃనిర్మించుకోవాలని పిలుపు నిచ్చారు. డీబీఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు కొరివి వినయ్‌కుమార్ మాట్లాడుతూ చుండూరు దళిత ఉద్యమ స్ఫూర్తితో సుప్రీం కోర్టులో హంతకులకు శిక్షలు వేసేంతవరకు న్యాయ పోరాటం కొనసాగిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ కేసులో దళితులకు అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో డీబీఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి మేళం భాగ్యరావు, వివిధ సంఘాల నాయకులు జాలాది మోజేస్, ఇసుకపల్లి జయరాజ్, చంద్రనాయక్, భూపతి సునీల్ కుమార్, పాందుగల ప్రకాష్, మేడిద బాబురావు, బత్తుల విల్సన్, కోడిరెక్క కోటిరత్నం, రెడ్డి రమణమ్మ, జయసుధ, సంకూరి రాజారావు పాల్గొన్నారు.

విద్యార్థులు కొత్త మార్గాలను అన్వేషించాలి



మాట్లాడుతున్న కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం

గుంటూరు ఎడ్యుకేషన్: జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకునేందుకు విద్యార్థులు కొత్త మార్గాలను అన్వేషించాలని టీజేపీఎస్ కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం తెలిపారు. మంగళవారం పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సర విద్యార్థులకు ఓరియెంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా కేవీ బ్రహ్మం మాట్లాడుతూ డిగ్రీ దశ ప్రతి విద్యార్థి జీవితంలో ఎంతో కీలకమైనదని, జీవితంలో స్థిరపడేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించుకునే దశ అని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్ మాట్లాడుతూ కళాశాలలో ఉన్నటువంటి వనరులను విద్యార్థి తన లక్ష్య సాధన కోసం ఉపయోగించుకుని ముందుకు వెళ్లాలని చెప్పారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ భానుమురళి, తెలుగు అధ్యాపకుడు డాక్టర్ జేవీ సుధీర్ కుమార్, డాక్టర్ పి.దేవేంద్ర గుప్త, బి. శ్రీనివాసులు పాల్గొన్నారు.

మెడికల్ విద్యార్థిని దత్తత తీసుకోవటం అభినందనీయం




విద్యార్థినికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే రామాంజనేయులు

గుంటూరు రూరల్: దళిత పేద మెడికల్ విద్యార్థినిని దత్తత తీసుకుని తన విద్యాభివృద్ధికి సాయం అందించడం అభినందనీయమని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బి.రామాంజనేయులు తెలిపారు. గోరంట్ల గ్రామంలోని మల్లికార్జునపురంకాలనీలోని మీ శ్రేయోభిలాష స్వచ్ఛంద సేవా సంస్థలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ గోరంట్ల గ్రామానికి చెందిన బిరుదు హాదస్సాకి కాకినాడలోని రంగనాయకులు మెడికల్ కళాశాలలో సీటు రావటం జరిగిందని, కానీ విద్యార్థిని పేదరికంతో చదువుకోలేని పరిస్థితిలో ఉండటంతో ఆమె గురించి తెలుసుకున్న మీ శ్రేయోభిలాష స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు నారా జోషి, అనుపమ దంపతులు విద్యార్థి విద్యాభివృద్ధికి కృషిచేయాలని ఆర్థిక సాయం చేయటం అభినందించదగిన విషయమన్నారు. మెడిసిన్ పూర్తయ్యే వరకు వారే పూర్తి బాధ్యత వహిస్తామని హామీ ఇవ్వటం జరిగిందన్నారు. ఎమ్మెల్యే చేతులమీదుగా మొదటి విడతగా రూ.29 వేల చెక్కును విద్యార్థికి అందజేశారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ బాలాజీ, సంస్థ సభ్యులు ఎస్ఎస్ మీరా, సి.కృష్ణారావు, సురేష్, మాధవరెడ్డి, వై అప్పాజీ, కోటేశ్వరరావు, వెంకటేశ్వరావు, వెంకటరావు, ధనుంజయరావు, శివరాస్వామి పాల్గొన్నారు.

డాక్టర్ అంబేడ్కర్ జీవితం ఆదర్శప్రాయం

పుస్తక రచయిత కొర్రపాటి సురేష్



గుంటూరు వెస్ట్: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, ఆధునిక భారతావని చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవితం ఆదర్శనీయమని టీడీపీ రాష్ట్ర నాయకుడు, దళిత ఉద్యమకారుడు కొర్రపాటి సురేష్ పేర్కొన్నారు. సురేష్ రచించిన అంబేడ్కరిజం(అంబేడ్కర్ జన జాగృతి గీతాలు) పుస్తకాన్ని వేమూరు శాసన సభ్యుడు నక్కా ఆనంద్‌బాబుకు మంగళవారం స్థానిక కార్యాలయంలో అంకితమిచ్చారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి దళిత ఉద్యమాలతోపాటు సామాజిక ఉద్యమాల్లో పనిచేసిన నక్కా ఆనంద్ బాబు జన్మదినాన్ని పురస్కరించుకుని తాను రచించిన పుస్తకాన్ని అంకితమిచ్చామన్నారు. తాను రచించిన పుస్తకం సమాజంలో ఆధునిక భావజాలంతోపాటు అంబేద్కరిజాన్ని మరొక్కసారి గుర్తుచేస్తుందని తెలిపారు.

ఉరుకు పటేల చిత్ర బృందం సందడి



విద్యార్థులతో కలసి నృత్యం చేస్తున్న చిత్రబృందం

గుంటూరు రూరల్: యువతకు మంచి మార్గనిర్దేశం చూపే సందేశాత్మక చిత్రాలను సినీ పరిశ్రమ ప్రోత్సహించాలని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేని పేర్కొన్నారు. మంగళవారం ఇటీవల విడుదలైన ఉరుకు పటేల చిత్రం విజయోత్సవ వేడుకల్లో భాగంగా చిత్ర బృందం చౌడవరంలోని కళాశాలలో సందడి చేసింది. యువతను దృష్టిలో ఉంచుకొని చిత్ర దర్శక, నిర్మాతలు కుటుంబ కథనాంశాలతో పాటుగా యువతకు స్ఫూర్తి నిచ్చే చిత్రాలను నిర్మించాలని కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ ఆకాంక్షించారు. నటీనటులు తేజస్ కంచెర్ల, ఖుష్బూ చౌదరి మాట్లాడారు. చిత్ర బృందం కళాశాల విద్యార్థులతో కలిసి నృత్యం చేసి, సెల్ఫీలు దిగి ఉత్సాహంగా గడిపారు. చిత్ర బృంద సభ్యులను కళాశాల సిబ్బంది సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏఓ డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, డాక్టర్ పి.కిషోర్ పాల్గొన్నారు.

వరద ప్రాంతాల్లో విజ్ఞాన్ విద్యార్థుల సర్వే

చేబ్రోలు: మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీకి చెందిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులు విజయవాడలోని వరద ప్రాంతాల్లో నాలుగో రోజు వరద సహాయక సర్వేలో పాల్గొన్నారని వైస్ చాన్సలర్ పి.నాగభూషణ్ మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ 300 మంది ఐదు గ్రూపులుగా విజయవాడ నగరంలోని వివిధ ప్రాంతాల్లో ప్రభుత్వం నుంచి అందుతున్న సహాయ కార్యక్రమాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అనే అనే విషయాలపై సర్వే నిర్వహించి ప్రభుత్వం అందించిన గూగుల్ లింక్‌లో అప్డేట్ చేస్తున్నారని పేర్కొన్నారు. మరి కొంతమంది విద్యార్థులు వివిధ ప్రాంతాల నుంచి లారీల్లో వచ్చిన ఆహార పదార్థాలను ట్రాక్టర్స్ లోకి అన్ లోడింగ్ చేయించి సమీప ప్రాంతాల్లోని ప్రజలకు అందించడంలో సహాయపడ్డారని వివరించారు.

ఇంట్లో బంగారం చోరీ

గుంటూరు రూరల్: ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి తాళాలు పగులగొట్టి చోరీ చేసిన ఘటన మంగళవారం నల్లపాడు పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాలు.. పరసా రమణయ్య న్యాయవాదిగా పనిచేస్తున్నాడు. భార్య విజయలక్ష్మి రీజనల్ నర్సింగ్ ఇనిస్టిట్యూట్‌లో విధులు నిర్వహిస్తున్నారు. మంగళవారం విధుల నిమిత్తం ఇరువురు బయటకు వెళ్లి సాయంత్రం ఇంటికి రాగా, ఇంటి తలుపులు వెనుక వైపు నుంచి తెరిచి ఉండటం గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలానికి చేరుకుని పోలీసులు వివరాలు సేకరించారు. దుండగులు ఇంట్లోని బీరువాలోని 50 సవర్ల బంగారం, ఇతర వస్తువులు కలపి సుమారు రూ. 50 లక్షల వరకు చోరీ జరిగినట్లు గుర్తించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పీసీఓడీ సమస్యలపై అవగాహన కలిగి ఉండాలి

డాక్టర్ షమా సల్తానా



డాక్టర్ షమా సుల్తానాను సన్మానిస్తున్న కాలేజ్ యాజమాన్యం

గుంటూరు మెడికల్: ఆధునిక జీవనశైలి వలన యువత పీసీఓడీ సమస్యలను ఎదుర్కొంటున్నారని ప్రముఖ గైనకాలజిస్ట్, హోప్‌విన్ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ షమా సుల్తానా అన్నారు. స్థానిక మార్కెట్ సెంటర్‌లోని హిందూ కళాశాలలో హిందీ విభాగం, ఉమెన్ డెవలప్‌మెంట్ సెల్ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థినులకు పీసీఓడీ సమస్యలపై అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. డాక్టర్ షమా సుల్తానా మహిళలు మానసిక ఒత్తిడి, ఆందోళన, శారీరక శ్రమ లేకపోవటం, పాశ్చాత్య జీవన విధానానికి అలవాటు పడటం, హార్మోన్స్‌లో తేడాలు, పోషకాహార లోపం, కొవ్వు పదార్థాలు, జంక్‌ఫుడ్స్ ఎక్కువ తీసుకోవటం, సరిపడా నిద్రలేకుండా రాత్రి వేళ్లలో ఎక్కువ సమయం సెల్‌ఫోన్స్, కంప్యూటర్స్ ముందు గడపటం వంటి కారణాలతో పీసీఓడీ సమస్య వస్తున్నట్లు వెల్లడించారు. ఈ సమస్యను ప్రాథమిక దశలోనే గుర్తించి మందులు వాడి జీవన విధానంలో మార్పులు చేసుకుంటే సమస్యలు ఉండవని చెప్పారు. పీసీఓడీ సమస్యలపై విద్యార్థినులకు సందేహాలు నివృత్తి చేశారు. అనంతరం కార్యక్రమ నిర్వాహకులు డాక్టర్ షమా సుల్తాన శాలువా కప్పి మెమెంటోతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పీఎం ప్రసాద్, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ పి.వేణుగోపాల్, ఉమెన్ డెవలప్‌మెంట్ సెల్ కన్వీనర్ వి.బ్యూలా రాణి, హిందీ విభాగం అధ్యాపకులు షేక్ బాజీ, డాక్టర్ ఎస్ వి ఎస్ గిరిజ, డాక్టర్ కె. లక్ష్మమ్మ, సిహెచ్. అరుణ, షేక్ హసీన, హోప్ విన్ హాస్పిటల్స్ మేనేజర్ పి. నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఐలమ్మ పోరాట స్ఫూర్తి చిరస్మరణీయం



నివాళులర్పిస్తున్న బీసీ సంక్షేమ సంఘ నాయకులు

నెహ్రూనగర్: భూస్వామ్య పెత్తందార్ల వెట్టిచాకిరికి వ్యతిరేకంగా పోరాటం చేసిన పోరాట యోధురాలు చిట్యాల ఐలమ్మ అని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు అధ్యక్షులు కుమ్మర క్రాంతికుమార్ పేర్కొన్నారు. మంగళవారం ఐలమ్మ వర్ధంతి పురస్కరించుకుని చుట్టుగుంటలోని సంఘ కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు అన్నవరపు నాగమల్లేశ్వరరావు, మల్లే ఈశ్వర్‌రావు, కోలా అశోక్, కొల్లూరి హనుమంతరావు, తిరుపతిరావు, నాగూల్‌మీరా, పోతురాజు పాల్గొన్నారు.

నెహ్రూ నగర్: తెలంగాణ సాయుధ పోరాటంలో భూమి, భుక్తి, వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడి ప్రపంచానికి తన ధీరత్వాన్ని చాటి చెప్పిన మహనీయురాలు ఐలమ్మ అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రజక జన సేవా సంఘం ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకొని కాకుమాను వారితోటలోని యానాది కాలనీలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జీఆర్ భగత్ సింగ్, సత్యనారాయణ, శివయ్య పాల్గొన్నారు.

పరిశోధన పద్ధతులపై వర్క్‌షాప్

గుంటూరు ఎడ్యుకేషన్: పట్టాభిపురంలోని టీజేపీఎస్ పీజీ కళాశాలలో మంగళవారం పరిశోధన పద్ధతులపై వర్క్‌షాప్ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. అనితాదేవి మాట్లాడుతూ టీజేపీఎస్ కళాశాల మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో ఏఎన్‌యూ, హిందూ మేనేజ్‌మెంట్ కళాశాల, టీజేపీఎస్ కళాశాల విద్యార్థులకు పరిశోధనలో భాగంగా సమస్యను ఎంపిక చేసుకుని, హైపో థీసీస్‌ను నిర్మించడం, నమూనాల ఎంపిక, సమాచార సేకరణ పద్ధతులపై విశ్లేషణ, నివేదిక సమర్పించడంపై వర్క్‌షాప్ నిర్వహించినట్లు చెప్పారు. ముఖ్య వక్తలుగా పాల్గొన్న డాక్టర్ బీవీహెచ్ కామేశ్వరశాస్త్రి, డాక్టర్ టి.నాత నిర్మలారాణి వర్క్‌షాప్ ఉద్దేశాన్ని వివరించారు. అనంతరం వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.

వరద బాధితులకు వివిధ సంస్థల సాయం



సీఎం చంద్రబాబుకు చెక్కు అందజేస్తున్న కృష్ణప్రసాద్, రాయపాటి శ్రీనివాసరావు



బియ్యం బస్తాలతో పాటిబండ్ల విష్ణువర్ధన్, వరప్రసాదరావు, కృష్ణవేణి తదితరులు



దుప్పట్లు పంపిణీ చేస్తున్న సంస్థ నిర్వాహకులు సెల్వరాజ్, మేరీ



టీజేపీఎస్ కళాశాల వద్ద ప్రారంభమైన రెండు మినీ వ్యాన్లు

గుంటూరు ఎడ్యుకేషన్: విజయవాడ వరద బాధితుల సహాయార్థం జేకేసీ కళాశాలరోడ్డులోని డాక్టర్ కేఎల్పీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు సంయుక్తంగా రూ.రెండు లక్షలు విరాళంగా అందజేసినట్లు పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ తెలిపారు. మంగళవారం వెలగపూడిలోని సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కలసి ఆ మొత్తాన్ని చెక్కు రూపంలో అందజేసినట్లు వివరించారు. పాఠశాల విద్యార్థులు స్వచ్ఛందంగా సమకూర్చిన రూ.1.15 లక్షలకు తోడు ఉపాధ్యాయ బృందం తమ ఒక్క రోజు వేతనం రూ.85 వేలను జత చేశారని చెప్పారు. పాఠశాల ప్రిన్సిపాల్ జి.రత్తయ్య మాట్లాడుతూ విద్యార్థుల్లో సేవాభావం, సేవాతత్పరతను పెంపొందించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వివరించారు. పాఠశాల వ్యవస్థాపకుడు డాక్టర్ కె.బసవపున్నయ్య, నాగార్జున ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర రాయపాటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీతారామయ్య స్కూల్ ఆధ్వర్యంలో..

గుంటూరు ఎడ్యుకేషన్: కృష్ణాజిల్లా మైలవరం నియోజకవర్గంలో వరద బారిన పడిన వంద కుటుంబాలకు శ్రీ పాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాల ఆధ్వర్యంలో బియ్యం పంపిణీ చేసినట్లు పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ తెలిపారు. మంగళవారం లక్ష్మీపురంలోని పాఠశాల నుంచి బస్సులో వంద కుటుంబాలకు సరిపడా బియ్యాన్ని పంపించారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ ఉపాధ్యక్షుడు డాక్టర్ సూర్యదేవర హనుమంతరావు, పాలకవర్గ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, పాఠశాల పూర్వ విద్యార్థి, మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ సహచరులు పి.సుధీర్, అబ్దుల్ రజాక్, ఐ.భాస్కర్, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ, ప్రైమరీ ప్రిన్సిపాల్ కర్లపూడి పార్వతీదేవి, కో-ఆర్డినేటర్లు శ్రీదేవి, దుర్గాశ్యామ్ పాల్గొన్నారు.

వరద బాధితులకు దుప్పట్లు పంపిణీ

గుంటూరు మెడికల్: గుంటూరుకు చెందిన ఆల్ఫినా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం బుడమేరు వరద బాధితులు 200 మందికి దుప్పట్లు పంపిణీ చేశారు. నంబూరు వీవీఐటి కాలేజ్ విద్యార్థిని ఎస్. రజితకు బీటెక్ ఫీజు నిమిత్తం రూ.19 వేలు చెల్లించినట్లు ట్రస్ట్ నిర్వాహకులు జాలాది సెల్వరాజ్, మేరీ తెలిపారు. ట్రస్ట్ సభ్యులు సిహెచ్. రమణ రూ.7,500, డాక్టర్ యు.ప్రకాశం, బి.శ్రీనివాసులు, సీహెచ్.అరవింద ఒక్కొక్కరు ఐదు వేల చొప్పున, ఎ.శారదమ్మ నాలుగువేలు ఇతర సభ్యులు విరాళాలు ఇవ్వటంతో వరద బాధితులకు దుప్పట్లు పంపిణీ చేశామని వెల్లడించారు.

ఈషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

నగరంపాలెం: ఈషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో విజయవాడ వరద బాధితుల సౌకర్యార్థం మంగళవారం రెండు వ్యాన్ల ల్లో బియ్యం, నిత్యావసర వస్తువుల కిట్లను తరలించారు. గుంటూరు జూట్ మిల్ ఎదురున్న టీజేపీఎస్ కళాశాల వద్ద మినీ వ్యాన్లకు పచ్చజెండా ఊపగా, సింగ్‌నగర్‌లోని రాజీవ్‌గాంధీనగర్, సుందరయ్యనగర్‌లో పంపిణీ చేశారు. ఈషా ఫౌండేషన్ సేవా సంస్థలో భాగమైన ఈశా ఔట్రీచ్ ద్వారా దాతల విరాళాల సాయంతో దఫాల వారీగా 1,100 ప్యాకెట్లను పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సౌజన్య, సాంబశి

గణేష్ మహారాజ్‌కి జై

వినాయక చవితి ఉత్సవాలు గుంటూరు నగరంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాల వద్ద మూడో రోజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వినాయకుడిని వివిధ అలంకరణ చేశారు. కొన్ని చోట్ల శాకంబరీ అలంకరణ, చిత్ర వస్త్రాలంకరణతో ఆకట్టుకున్నారు.

-సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు



శ్రీకన్యకాపరమేశ్వరి దేవస్థానంలో..



ఏలూరు బజారులో శాకంబరీ..



కేవీపీ కాలనీ 1/10లో వస్త్రలంకరణలో..